క్లుప్తంగా

15 నుంచి మండల స్థాయి క్రీడలు

తాడూరు: మండల స్థాయి క్రీడలు ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం చీఫ్‌మినిస్టర్ కప్ 2023లో భాగంగా మండల స్థాయితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల పురుషులు, మహిళలు పాల్గొన వచ్చన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో 5 విభాగాల్లో స్త్రీలు, పురుషులకు పోటీలు నిర్వహిస్తా రన్నారు. 15న సాయంత్రం 5 గంటల లోపు క్రీడల్లో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయన్నారు.

ఆర్థిక సాయం అందజేత



వెల్దండ: మండల పరిధిలోని శంకరకొండతండాకు చెందిన మహిపాల్ కుటుంబానికి పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శుక్రవారం వెల్దండలో అందజేశారు. తండాకు చెందిన మహిపాల్ బైక్‌పై వెళ్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన పార్టీ సభ్యత్వం పొందడంతో ఎమ్మెల్యే సహకారంతో పార్టీ నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయన్నారు.

విద్యార్థి ప్రతిభకు ప్రోత్సాహకం



మన్ననూర్: స్థానిక జంగాల కాలనీకి చెందిన విద్యార్థి శ్రీను 10వ తరగతిలో లింగాల మండలంలో మొదటి ర్యాంకు సాధించడంపై ఎమ్మెల్యే గువ్వల బాలరాజు శుక్రవారం విద్యార్థిని అభినందించాడు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించి రూ.10 వేల నగదు అందజేశారు. ఉన్నత చదువుల్లో రాణిస్తే భవిషత్‌లో మరింత సాయం చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ శ్రీరాంనాయక్, రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు, షమీముల్లా, గణేష్, మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు..

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌కి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో 980 చొప్పున మార్కులు సాధించారు. శుక్రవారం తర్నికల్‌లో గౌతమి, పావనిలను రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు సురేష్‌గౌడ్ శాలువాలతో సన్మానించారు. ఇద్దరు విద్యార్థులు 10వ తరగతి తర్నికల్ పాఠశాలలోనే చదివారని చెప్పారు.

తహసీల్దార్‌కు సన్మానం

చారకొండ: ఇటీవల చారకొండ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావుకు మండల రైతుబంధు అధ్యక్షుడు యాదయ్యగౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, మల్లేష్, యాదయ్య, జయసింహ రెడ్డి తదితరులు శాలువా, పూలమాలలతో సన్మానించి సత్కరించారు.

ఏకగ్రీవ ఎన్నిక



కొల్లాపూర్: జామెమసీద్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాజాచావుష్, యాసిన్‌లను శుక్రవారం ముస్లింలు సత్కరించారు. ఇటీవల నూతన కమిటీని ముష్రఫ్ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. కొల్లాపూర్ పట్టణంలోని మసీదులన్నింటినీ అభివృద్ధి చేసేందుకు మావంతు ప్రయత్నం చేస్తామన్నారు. మహబూబ్ అలీ, పర్వేజ్, ఖుర్బాన్‌అలీ, రుక్మద్దీన్, షబ్బీర్, బాబుజానీ, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్‌ను వివరించాలి

కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన యూత్ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలను ప్రతి గ్రామంలోని నిరుద్యోగ యువతీ యువకులకు తెలిసేలా చేయాలని యువజన కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యువతను పార్టీ వైపు ఆకర్షించేలా చూద్దామన్నారు. సుదర్శన్, శ్రీహరి పాల్గొన్నారు.

జిల్లాకు తరలిన కార్యదర్శులు

కల్వకుర్తి రూరల్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. నిరవధిక సమ్మెకు దిగిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి



అదనపు గదుల కోసం భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, ఎంఈఓ తదితరులు

తాడూరు: 'మన ఊరు– మన బడి' పనులను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ గోవిందరాజులు ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన 'మన ఊరు– మన బడి' అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం సకాలంలో పూర్తిచేయాలని, ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. జూన్ మాసంలో పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా 'మన ఊరు– మన బడి' పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాల ప్రహరీతో పాటు కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లకు రంగులు వేయడంతో పాటు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మైదానమంతా చదును చేసి అక్కడక్కడ మొక్కలను నాటాలన్నారు.



పాఠశాల పనులు పరిశీలిస్తున్న డీఈఓ

పనులకు భూమిపూజ

తెలకపల్లి: 'మన ఊరు– మన బడి' పనుల్లో భాగంగా అదనపు గదుల నిర్మాణానికి ఎంపీపీ కొమ్ము మధు, ఎంఈఓ చంద్రుడు భూమిపూజ నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి రూ.70 లక్షలు మంజూరయినట్లు ఆ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రకాశ్ తెలిపారు. 3 అదనపు గదుల కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయి. డైనింగ్ హాలుకు రూ.15 లక్షలు, ఇతర పనుల నిమిత్తం రూ.15 లక్షలు మొత్తం రూ.70 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. పాఠశాల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తికావాలని ఎంపీపీ కొమ్ము మధు, ఎంఈఓ చంద్రుడు తెలియజేశారు. కార్యక్రమంలో విజయనిర్మల, విజలక్ష్మి, కృష్ణయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



కొల్లాపూర్ వేడుకల్లో ఆస్పత్రి నర్సులు



అచ్చంపేటలో సన్మానిస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

కొల్లాపూర్: ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆస్పత్రిలో మహిళా ఉద్యోగులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగులుగా పని చేస్తున్న మహిళలను వైద్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆస్పత్రి వైద్యులు యాదగిరి బిల్లా, ఎస్‌కే.లాల్, జయచంద్రప్రసాద్ యాదవ్, జీకే.వెంకటేష్, శశికళ, అనిత పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఫ్లోరెన్సు నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, సాయిప్రసాద్, నరేష్, పరమేశ్వరప్రసాద్, సాయిరాం, పావని పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని నక్కలపల్లిలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు, ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ రవినాయక్ భక్తులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠించిన లక్ష్మీచెన్నకేశవ స్వామి విగ్రహాలు

పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు



మాట్లాడుతున్న చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్

అచ్చంపేట: పట్టణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. శుక్రవారం అచ్చంపేట మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మిషన్ భగీరథ కింద విడుదలైన నిధులతో వివిధ కాలనీల్లో రూ.2 కోట్లతో సీసీరోడ్లు పూర్తి చేశామన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకున్నామన్నారు. శ్మశానవాటికలో మిగులు పనులను పూర్తి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.20 లక్షలు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో రూ.14.27 కోట్లతో డంపింగ్ యార్డు పనులు చేపట్టామన్నారు. కొత్త మున్సిపల్ భవనం నిర్మాణం కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పాత భవనం కూల్చివేసి తాత్కాలిక భవనం ఏర్పాటు చేశామన్నారు. రూ.30 లక్షలతో శ్మశానవాటికలో పచ్చదనం, కంపౌడ్ వాల్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాల్‌రాంనాయక్, మేనేజర్ అనిత, ఏఈ షబ్బీర్, కౌన్సిలర్లు మన్నుప్రసాద్, గౌరీశంకర్, తగురం శ్రీనివాసులు, రమేష్‌రావు, సోమ్లానాయక్, అంతటి శివ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

అచ్చంపేట రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతోందని అచ్చంపేట ఎంపీపీ శాంతాబాయి అన్నారు. శుక్రవారం అచ్చంపేట మండల పరిషత్ కార్యాలయం సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు చేపట్టిన అభివృద్ధి పనులు, వివరాలను చదివి వినిపించారు. డివిజన్, మండల స్థాయి అధికారులు కాకుండా కింది స్థాయి సిబ్బంది హాజరుకావడంతో పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని, అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలపై జాగ్రత్తలు వహించాలని, మొక్కలు ఎండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అరుణ, వైస్ ఎంపీపీ అమరావతి, ఏడీఏ చంద్రశేఖర్, ఎంపీడీఓ మధుసూదన్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శాంతాబాయి

పోలుమూరులో ముగిసిన కంటివెలుగు

తాడూరు: మండలంలోని పోలుమూరులో వారం రోజుల నుంచి నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా సర్పంచ్ నాగయ్య మాట్లాడారు. ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో గ్రామంలోని 510 మంది కంటి వెలుగు పరీక్షలు నిర్వహించుకున్నారని, వారిలో ఆపరేషన్ అవసరమైన వారి జాబితాను తయారు చేయడంతో పాటు అద్దాలు అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డాక్టర్ ఎండీ ఇస్మాయిల్, శ్రీనివాసులు, శారద, పారిజాత, శారమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు గాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు అందజేస్తున్న సర్పంచ్

టీడీపీ సమావేశానికి హాజరుకావాలి

కొల్లాపూర్: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కొల్లాపూర్‌లోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థాయి టీడీపీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పగిడాల శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం నిర్వహించనున్న సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు నేతలు హాజరవుతారని తెలియజేశారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

తెలకపల్లి: మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఎంపీపీ కొమ్ము మధు అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశాన్ని కోరం లేక వాయిదా వేసినట్లు చెప్పారు.

రూ.1.31 లక్షలకు చెట్ల వేలం

అచ్చంపేట: మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని నాలుగు చెట్లను శుక్రవారం వేలం వేయగా రూ.1.31 లక్షలకు లక్ష్మీపతి దక్కించుకున్నాడు. మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు స్థలం అప్పగించే పనిలో భాగంగా అడ్డంగా ఉన్న మూడు వేప చెట్లు, ఒక నీలగిరి చెట్లకు టెండర్ ఆహ్వానించారు. టెండరులో ఐదుగురు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, కమిషనర్ బాల్‌రాంనాయక్, కౌన్సిలర్లు గౌరీశంకర్, అంతటి శివ, రమేష్‌రావు, రమేష్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

లింగాల: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మండలంలోని అంబట్‌పల్లి, అవుసలికుంట మార్గంలో వాహనాలను తనఖీ చేస్తున్న సమయంలో మండలంలోని నల్లకుంటకు చెందిన రవి ట్రాక్టర్ ద్వారా ఇసుకను తరలిస్తూ.. పట్టుబడినట్లు చెప్పారు. ఇసుకతో పాటు ట్రాక్టర్‌ను స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని అవుసలికుంట మార్గంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సాయి, పురుషోత్తం అనే యువకులు తీవ్ర గాయాలయ్యాయి. బాధిత వ్యక్తులు మండలంలోని చెన్నంపల్లిలో జరిగిని ఓ వివాహ వేడుకల్లో పాల్గొని ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తున్నారు. వాహనం అదుపు తప్పి కింద పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని మంతటిగేటు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం రఘుపతిపేటకి చెందిన చంద్రయ్య బిజినేపల్లి మండలం పాలెంలో జరిగిన బీరప్ప పండుగలకు హాజరయ్యాడు. ద్విచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మంతటి గేటు సమీపంలో ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికత్స నిమత్తం చంద్రయ్యను జనరల్ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

యువతి అదృశ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. యువతి రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ గోవర్ధన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులపై నిర్లక్ష్యం వహించొద్దు

బిజినేపల్లి: ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు ఆ పంటను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడకుండా అధికారులు బాధ్యత వహించాలని, వారిపై నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ, ఆర్‌సీతండా గ్రామాల మధ్య ఆరబోసిన వరి ధాన్యాన్ని అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. సొసైటీ అధికారులు సంచులు ఇవ్వడానికి చాలా సమయం తీసుకుంటున్నారని, నింపిన ధాన్యం తరలించడానికి కూడా సమయం ఎక్కువ తీసుకుంటున్నారని బాధ వెల్లబుచ్చారు. వెంటనే ఎమ్మెల్యే మర్రి డీఎస్‌ఏఓ, సొసైటీ సీఈఓ నరేష్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు తక్షణమే ధాన్యం బస్తాలు అందించి లోడ్ చేయాలని సూచించారు.

ఎల్‌ఓసీ అందజేత

తెలకపల్లి: ఎల్‌ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధితులకు అందజేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. మండల పరిధిలోని వట్టిపల్లికి చెందిన గణేష్ మోకాలికి సంబంధించిన ఆపరేషన్ కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని ఎమ్మెల్యే బాధితుడికి అందజేశారు. మోకాలి వద్ద నరం తెగిపోవడంతో అనారోగ్యం పాలైన గణేష్ మెరుగైన వైద్యం నిమిత్తం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి రూ.లక్ష ఎల్‌ఓసీ లెటర్‌ను అందజేశారు. జిల్లా గ్రంథాల చైర్మన్ హనుమంతురావు, టీఆర్‌ఎస్ నాయకులు విష్ణు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బీజేపీ నిరంకుశ విధానాలపై తిరగబడాలి



కుడికిల్లలో మాట్లాడుతున్న బాలనరసింహ

కొల్లాపూర్ రూరల్: దేశంలో బీజేపీ ప్రభుత్వం నరేంద్ర మోదీ, అమిత్‌షా చేసున్న అరాచక విధానాలపై ప్రజలు తిరగబడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కుడికిల్ల, చుక్కాయపల్లి, అంకిరావుపల్లి, ముక్కిడిగుండం, ఎల్లూరు, తదుతర గ్రామాల్లో ప్రజా పోరు యాత్ర సాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. దేశంలో ప్రభుత్వపరంగా సంస్థలనింటిని ఆదానీ, అంబానీలకు అప్పనంగా దేశ సంపదనంతా దోచిపెడుతున్నారని ధ్వజమెత్తారు. నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి అయిన తర్వాత అతి స్వల్ప కాలంలో ఆదానీ రూ.లక్షల కోట్లు ఎలా సంపందించారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరసింహ, ఇందిరా, వెంకటమ్మ, తుమ్మల శివుడు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లి బీసీ కాలనీలో చిన్నపాటి వర్షానికి కాలనీలు చిత్తడిగా మారుతున్నాయి. రాత్రి కురిసిన అకాల వర్షాలకు బీసీ కాలనీలో సీసీరోడ్లు లేకపోవడంతో నీరంతా రోడ్లపై చేరి నడవలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, అధికారులు స్పందించి సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



వర్షానికి చిత్తడిగా మారిన మట్టిరోడ్డు

బొడ్రాయి ఉత్సవాలకు పూజలు

వెల్దండ: మండల పరిధిలోని అజిలాపూర్‌లో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సర్పంచ్ కాలే లక్ష్మమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్రాయి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. గ్రామ దేవతల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలోని అన్ని కులాలకు చెందిన పెద్దలు, సంఘం నాయకులు ప్రత్యేక దృష్టి సారించి బొడ్రాయి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. ఎంపీటీసీ లక్ష్మమ్మ, నాయకులు వెంకటేష్, మల్లేష్‌గౌడు, శేఖర్, పెద్దయ్యగౌడ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ప్రమాదకరం

ఉప్పునుంతల: ఉప్పునుంతల–అచ్చంపేట ప్రధాన రహదారిలో మల్లప్పవాగు సమీపంలో బీటీ రోడ్డుపై పడిన కొద్దిపాటి గోతి ప్రమాదాలకు కారణమవుతుంది. రోడ్డుపై గోతి కారణంగా అక్కడ వచ్చిపోయే వాహనదారులు రోడ్డు బాగున్న సైడ్ నుంచే వెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎదురెదురు వాహనాలు ఢీకొని తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. నెల క్రితం రెండు బైకులు ఢీకొని ఉప్పునుంతలకు చెందిన భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా రోడ్డుపై గోతిని పూడ్చే ప్రయత్నాలు చేయడంలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా మరోసారి ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు బీటీ రోడ్డుపై గోతిని పూడ్చివేయించాలని కోరుతున్నారు.



మల్లప్పవాగు ప్రాంతంలో ప్రమాదాలకు కారణమవుతున్న గోతి

దారి పొడవునా ధాన్యం ఆరబోత



కోడేరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. కోడేరు నల్లగుట్ట నుంచి జనుంపల్లి వరకు రైతులు గతంలో రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు చోటు చేసుకొని కాళ్లు, చేతులు విరిగి మృత్యువాత పడిన సంఘటన ఉన్నాయి. ఈ యాసంగిలో పండించిన వరిధాన్యం బావాయిపల్లి గ్రామ రైతులు ప్రధాన రహదారిపై దాదాపు కిలోమీటరు వరకు రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసు అధికారులు స్పందించి రహదారులపై ధాన్యం ఆరబెట్టకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ రాజును వివరణ కోరగా.. ప్రదాన రహదారులపై ఎవరైనా ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయకుండా చూస్తామన్నారు.